# సాక్షి పెద్దపల్లి



గురువారం । 31 । ఆగస్టు । 2023



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, యువతులు



స్వీట్ దుకాణంలో కొనుగోలుదారుల సందడి



## రాఖీ సందడి



నాకు నువ్వు రక్షా.. నీకు రాఖీ రక్షా.. అంటూ సోదర, సోదరీమణుల ఆప్యాయతకు ప్రతీక అయిన రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. తమ సోదరులకు రాఖీ కట్టేందుకు తోబుట్టువులు రెడీ అయ్యారు. వివిధ రకాల డిజైన్లతో రాఖీలు మార్కెట్లో ఆకట్టుకుంటుండగా కొనుగోళ్లతో సందడిగా మారాయి. రక్షాబంధన్ సందర్భంగా మిఠాయి దుకాణాల్లో గిరాకీ నెలకొంది. పలురకాల స్వీట్లు నోరూరిస్తుండగా.. కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. నేడు రక్షాబంధన్ సందర్భంగా ప్రత్యేక కథనం..

- 8లో ▸

## న్యూస్‌రీల్

### ప్రతీ కార్యకర్తకు గౌరవం



బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు

మంథని: పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తను గౌరవించే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బుధవారం మంథనిలోని ఆయన నివాసంలో ముత్తారం మండలం పారుపల్లి, మంథని మండలం అడవిసోమన్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడం సాధ్యమవుతుందన్నారు. ఏళ్లకు ఏళ్లు పార్టీ జెండా మోసి పాలకులను భుజాలపై ఎత్తుకున్న వారి కష్టాలను గుర్తించకపోగా కనీసం ఆపదలో ఉన్నప్పుడు పైసా సాయం చేయని కాంగ్రెస్ పార్టీకి స్వస్తి పలకాల్సిన సమయం వచ్చిందని అన్నారు.

### అభ్యంతరాలుంటే తెలపాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమనాయక్

మంథని: ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని ఆర్డీవో హనుమ నాయక్ అన్నారు. బుధవారం మంథని ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నూతన ఓటర్ల నమోదు, జాబితాలో సవరణ వివరాలు, జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, బీఎల్‌వోల వివరాలు అందించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తెలియజేశారు. ఎలక్షన్ డీటీ సంతోష్‌సింగ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వృక్షాబంధన్



పండ్ల చెట్లకు రాఖీలు కడుతున్న మహిళలు

జ్యోతినగర్: అందరూ రక్షాబంధన్ జరుపుకునే సమయంలో వినూత్నంగా తెలంగాణ మహిళా మిత్రసభ్యులు పండ్ల మొక్కలకు రాఖీలు కట్టి వృక్షాబంధన్ జరుపుకున్నారు. బుధవారం రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీలో వ్యవస్థాపక అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ ఆధ్వర్యంలో మహిళలు పూలతో రాఖీలు తయారు చేసి పండ్ల చెట్లకు కట్టారు. రాఖీ పర్వదినం రోజున సోదరులకు రాఖీలు కట్టే సాంప్రదాయం మనదని, అలాగే మానవాళికి అండగా నిలుస్తున్న ప్రకృతిలో భాగమైన పండ్ల మొక్కలకు రాఖీలు కట్టి వాటిని సమాజంలో ఓ భాగంగా గుర్తించాలని కోరారు.

### 2నుంచి సదరం స్లాట్ బుకింగ్


పెద్దపల్లిరూరల్: దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం ఈనెల 2 నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ అన్నారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావల్సిన వారు, తాత్కాలిక, రెన్యూవల్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. శారీరక వైకల్యం ఉన్న వారు ఈనెల 5, 21 తేదీల్లో, దృష్టి లోపం ఉన్న వారు 14న, మానసిక అంగవైకల్యం, బుద్ధిమాంద్యం వారు 18న, వినికిడి లోపం గల వారు 26వ తేదీన నిర్వహించే సదరం శిబిరంకు స్లాట్ నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చేటప్పుడు ధ్రువీకరణ పత్రాలను వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

### సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



పెద్దపల్లిరూరల్: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగుల చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బుధవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను మరచిపోయారని విమర్శించారు. నాయకులు వెంకటేశం, సుధాకర్, తిరుపతి, మమత, శ్రీధర్, నాగరాజు, రాజ్‌కుమార్, రహీం, మల్లయ్య సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అను‘మతి’లేని వైద్యం..!



- ‘ఈనెల 26న గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన సతీశ్ (35) జ్వరం, తలనొప్పితో బాధపడుతూ.. ఆర్‌ఎంపీ వద్దకు వైద్యం కోసం వెళ్లాడు. పరిశీలించిన సదరు ఆర్‌ఎంపీ ఇంజక్షన్ ఇచ్చాడు. తీవ్రమైన నొప్పితోపాటు వాపు రావడంతో మరోసారి అతడి వద్దకే వెళ్లాడు సతీశ్. మరో ఇంజక్షన్ ఇచ్చినప్పటికీ నొప్పి తగ్గకపోగా వికటించింది. వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు..’
- ‘ఇటీవల కమాన్‌పూర్ మండలంలో ఓ బాలుడికి జ్వరం రాగా ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆయన వైద్యం అందించగా వికటించి మృతిచెందాడు..’ ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ చోటుచేసుకుంటున్నా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం.

### మెడి ‘మిడి’ జ్ఞానం

- వచ్చీరాని వైద్యంతో ప్రాణాలతో చెలగాటం
- పరిజ్ఞానం లేకున్నా.. అర్హతకు మించి వైద్యం
- పట్టించుకోని వైద్య అధికార యంత్రాంగం

సాక్షి, పెద్దపల్లి: ఆర్‌ఎంపీ అంటే కేవలం ప్రాథమిక చికిత్స చేయడానికి మాత్రమే అర్హులు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండే ఆర్‌ఎంపీలు, పీఎంపీలు వారికున్న అవగాహన, అనుభవం మేరకు చికిత్స అందించి ప్రాణాలు కాపాడుతుంటారు. కానీ.. జిల్లాలో పలువురు ఆర్‌ఎంపీలు ధనార్జనే ధ్యేయంగా అన్ని రకాల వైద్యసేవలు అందిస్తూ హద్దు దాటుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా మందులు, యాంటీబయాటిక్స్ రాస్తున్నారు. అవి వాడిన రోగులకు కొత్తరోగాలు రావడంతోపాటు కిడ్నీలు ఫెయిలవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్కోసారి కొందరు ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నారు. కొందరు కనీసం పదో తరగతి కూడా చదవకున్నా పల్లెల్లో పెద్ద డాక్టర్‌గా చెలామణి అవుతున్నారు. చిన్నగదిలోనే పెద్ద ఆస్పత్రి మాదిరిగా సెలైన్‌లు పెట్టడం.. మందులు విక్రయించడం.. గాయాలకు కుట్లు వేయటం చేస్తూ అను‘మతి’ లేని వైద్యంతో ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

### జిల్లాలో ఇలా..

జిల్లావ్యాప్తంగా రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్ (ఆర్‌ఎంపీ)లు 300కు పైగానే ఉంటారని వైద్య, ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలకు పరీక్షలు చేయడమే కాకుండా వైద్యం కూడా అందిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీలు ఎంబీబీఎస్ స్థాయి వైద్యులు చేయాల్సిన వైద్యం అందిస్తున్నా.. వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కొద్ది రోజులే కాంపౌండర్

పెద్ద ఆస్పత్రుల్లో ఐదారు నెలలపాటు కాంపౌండర్‌గా పనిచేయడం, కొంత వైద్య పరిజ్ఞానం సంపాదించి సొంత ఊరిలో ఆర్‌ఎంపీలుగా అవతారం ఎత్తడం జిల్లాలో పరిపాటిగా మారింది. ఇంజక్షన్ చేయడం వస్తే చాలు వైద్యం నిర్వహించేందుకు ముందడుగు వేస్తున్నారు. కాంపౌండర్‌గా పనిచేసిన సమయంలో తెలిసిన కొద్దిపాటి పరిజ్ఞానంతో గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్‌లు పెట్టేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులున్నప్పటికీ వారు సొంత ఆసుపత్రులకు ఎక్కువగా ప్రాధాన్యమివ్వడం, సమయపాలన పాటించకపోవడం, వచ్చిన రోగులను పట్టించుకోకపోవడంతో రోగులు స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలు, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. దాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు గ్రామీణ వైద్యులు తెలిసీ తెలియని వైద్యాన్ని కొంతమేర నిర్వహించి, పెద్దాస్పత్రులకు తరలిస్తున్నారు. ప్రాథమిక చికిత్స మొదలుకుని ఆస్పత్రి నుంచి బయటికి వచ్చే వరకు అంతా తామై నడిపిస్తూ దండుకుంటున్నారు.



### కమీషన్లు.. నజరానాలు

మరోపక్క రిఫర్ పేరుతో పలు ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను తీసుకుపోతూ బిల్లుల పేరుతో దోస్తున్నారు. కొన్ని ప్రయివేటు ఆసుపత్రుల వైద్యులు కమీషన్లు ఇచ్చి మరి ఆర్‌ఎంపీలు తమ ఆసుపత్రులకే పేషెంట్లను రెఫర్ చేసేలా వ్యవహారం నడిపిస్తున్నారు. పలు డయాగ్నొస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు ఆర్‌ఎంపీలు పంపే రోగులపై ఆధారపడే కొనసాగుతున్నాయన్న విమర్శలు లేకపోలేదు. ఇదే విషయమై డీఎంహెచ్‌వో వివరణ కోరగా తనిఖీలు నిర్వహిస్తామని, అర్హతకు మించి వైద్యం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారికి అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## సీనియర్ సిటిజన్లకు తోడ్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లిరూరల్: సీనియర్ సిటిజన్ల (వృద్ధులు) సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వయోవృద్ధుల సంక్షేమ చట్టం అమలుపై నిర్వహించిన సీనియర్ సిటిజన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. కుటుంబీకుల నుంచి నిరాదరణకు గురవుతున్నామని భావించే వృద్ధులు ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సత్వరమే చర్యలు తీసుకొని న్యాయం చేసేలా ఆదేశాలిస్తారని తెలిపారు. కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు.

**ప్రయాణంలో రాయితీ ఇప్పించండి**

ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు రాయితీ కల్పించేలా చూడాలని పలువురు వృద్ధులు కోరారు. ఈవిషయం ప్రభుత్వ పరిధిలో ఉంటుందని, పరిశీలించాలని ప్రభుత్వానికి నివేదిస్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రెండు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి యోగా, లాఫింగ్ క్లాసులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ , జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్, సంఘ నాయకులు పీటీస్వామి, రాజేశం, జీవన్‌రాజు, సుందరి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: ప్రతీ విద్యార్థి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని చదువులో మంచి ఫలితాలు సాధించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మారం మండలం మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో పేరెంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. దేశంలో ఉన్న ప్రతిఒక్కరికీ సమాన హక్కులు కల్పించిన మహా నేత అంబేడ్కర్ అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించి బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంధం వరలక్ష్మి, ఉప సర్పంచ్ మంద శ్రీనివాస్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, ప్రిన్సిపాల్ గిరిజా, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుంచు మల్లేశం, అంబేడ్కర్ సంఘం నాయకులు కాంపెల్లి చంద్రశేఖర్, పెరుక బానేష్, బొల్లి నందయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధరణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కాల్వశ్రీరాంపూర్/ఓదెల: ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. బుధవారం కాల్వశ్రీరాంపూర్, ఓదెల తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఇటీవల సర్దుబాటులో వచ్చిన వీఆర్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రైతులు, దరఖాస్తుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలు, ప్రజాపంపిణీ వ్యవస్థ, ధరణి, రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై ఆరాతీశారు. తహసీల్దార్లు జాహెద్‌పాషా, యాకన్న, ఆర్‌ఐలు వైశాలి, బండ రాజేందర్, నర్సింగ్, సూపరింటెండెంట్ దీరజ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

## సోదరుడికి కడసారి రాఖీ

- మృతదేహానికి రాఖీ కట్టిన సోదరి



కనుకయ్య(ఫైల్)



సోదరుడి మృతదేహానికి రాఖీ కడుతున్న సోదరి

ఎలిగేడు: రాఖీ పండుగ ఒకరోజు ముందే సోదరుడు మృతి చెందడంతో గుండెల నిండా తన్నుకు వస్తున్న దుఃఖాన్ని బిగపట్టి మృతదేహానికి రాఖీ కట్టి ఆ చెల్లె తన సోదర ప్రేమను చాటుకు విషాద సంఘటన ఎలిగేడు మండలం ధూళికట్టలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దూళికట్టకు చెందిన చౌదరి కనుకయ్య (50) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. రాఖీ కట్టేందుకు బయలుదేరి వచ్చిన చెల్లె గౌరవ విగత జీవుడైన సోదరుడి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించింది. రక్తం పంచుకుపుట్టిన తన సోదరుడు ఒక లేడని చేదు నిజం జీర్ణించుకోలేక పోయింది. తాను తెచ్చిన రాఖీని తన సోదరుడి మృత దేహానికి చివరి సారిగా కట్టింది. ఈసారి రాఖీ కట్టేందుకు ఒక రోజు ముందుగా రమ్మని ఫోన్ చేస్తివి కదా? అంటూ మృత దేహంపై పడి రోదించిన తీరు గ్రామస్తుల హృదయాలను కదిలించింది. మృతుడికి భార్య సరవ్వ, తల్లిదండ్రులు ఎల్లమ్మ నర్సయ్య, కుమారుడు రూప్ శంకర్, కూతురు పద్మలు ఉన్నారు.

## ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ మహేశ్

పెద్దపల్లిరూరల్: ప్రజల సహకారంతోనే నేరాలను నియంత్రించగలుగుతామని, అనుమానాస్పదంగా కనిపించే అపరిచితుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఏసీపీ ఎడ్ల మహేశ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం సీఐ అనిల్, ఎస్సై మహేందర్, వెంకటేశ్‌లతో కలిసి నిమ్మనపల్లిలో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, అపరిచితులతో ఫోన్ కాల్ మాట్లాడడం, చాటింగ్‌లు చేయడం వల్ల మోసపోయే ప్రమాదముందన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు.

## వైజాగ్ టూ కోల్‌బెల్ట్..!

పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఇటీవల గంజాయి పీల్చుతున్న వీడియోను వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. ఓ యువకుడు తన తోటి యువకులకు గంజాయి అలవాటు చేసి వారి ద్వారా వ్యాపారం నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇలాంటి సంఘటనలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్దమొత్తంలో సాగుతున్నాయి. గతంలో గంజాయితో తయారుచేసిన హష్‌ఆయిల్ కూడా గోదావరిఖనిలో పట్టుబడడం కలకలం సృష్టించింది. గంజాయి, గుడుంబా విక్రయాలతో నేర సంఘటనలు పెరిగిపోతున్నాయి. చాలామంది చిన్న వయసులోనే గంజాయికి బానిసై తమ ఉజ్వల భవిష్యత్ చేజేతులా నాశనం చేసుకుంటున్నారు.

- జోరుగా సాగుతున్న గంజాయి రవాణా
- మత్తుకు బానిసవుతున్న విద్యార్థులు, యువత
- కోల్‌బెల్ట్ ప్రాంతంలో భారీగా అమ్మకాలు



స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితుడు (ఫైల్)

గోదావరిఖని: కోల్‌బెల్ట్ ప్రాంతంలో గంజాయి మాఫియా చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి రైలు, బస్సుల ద్వారా సరిహద్దులు దాటి జిల్లాలోకి చేరుతోంది. తక్కువ ధరలో.. ఎక్కువ మత్తునిచ్చే గంజాయికి విద్యార్థులు, యువత బానిసలవుతున్నారు. గంజాయి తాగేందుకు కొన్ని ప్రాంతాలు అడ్డాలుగా మారాయి. స్కూళ్లు, ప్లేగ్రౌండ్‌లు, నిర్మానుష్య ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. ముందుగా గంజాయి అలవాటు చేయడం, ఆ తర్వాత విక్రయాలు అంటకట్టడం జరుగుతోంది. దీంతో రోజురోజుకూ వినియోగం పెరుగుతున్నట్లు సమాచారం. తక్కువ డబ్బులతో ఎక్కువ మత్తునిచ్చే గంజాయి పీల్చుతూ యువత ఊహాలోకాల్లో విహరిస్తున్నారు. సమయానికి చేతికి డబ్బులందక అక్రమమార్గాలు, నేరాల వైపు పయనిస్తున్నారు. గంజాయితో తయారు చేసిన హష్‌ఆయిల్ విక్రయాలు ఈ ప్రాంతంలో సాగుతున్నాయి. గతంలో ఎక్సైజ్ పోలీసులకు యువత వద్ద హష్‌ఆయిల్ పట్టుబడింది. దూల్‌పేట్ వంటి ముద్దు పేర్లతో గుడుంబా, గంజాయి అడ్డాలుగా మారుతున్నాయి. అర్ధరాత్రి స్పోర్ట్స్ బైక్‌లపై రయ్‌మంటూ దూసుకెళ్తూ.. ఆ మత్తులో తూగుతూ ప్రమాదాల బారిన పడుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ గంజాయి విక్రయాలు, వినియోగదారులు మాత్రం తగ్గడం లేదు. స్మగ్లర్లు రోజురోజుకూ తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. విక్రయాలపై నిఘా వర్గాలు దృష్టి సారించలేకపోతున్నాయే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ఎక్కువగా గంజాయి రవాణా జిల్లాలోకి వస్తుండగా.. ఇటీవల ఓ యువకుడు వైజాగ్ నుంచి గంజాయి తీసుకొస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్ద 6.4 కిలోల గంజాయిని పట్టుకున్నారు. బస్సులు, రైళ్లు, పడవల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు చేర్చుతున్నట్లు తెలుస్తోంది.

### హష్‌ఆయిల్‌కు ఫుల్ డిమాండ్

పది కిలోల గంజాయితో సమానంగా ఉండే లీటర్ హష్‌ఆయిల్ రూ.10లక్షలకు పైగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా యువతకు గంజాయి అలవాటు చేస్తూ ఉచ్చులోకి దింపి వ్యసనపరులుగా మార్చుతున్నారు. ఆ తర్వాత వారినే విక్రయాల్లో భాగస్వాములను చేస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారు.

**వైజాగ్ నుంచి తీసుకొస్తుండగా..**

ఇటీవల ఓ యువకుడు గంజాయిని ప్యాకింగ్ చేసి తీసుకొస్తూ బసంత్‌నగర్ సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డాడు. బస్సులో వస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు పోలీసులు. ఈ ఘటనలో సదరు యువకుడి నుంచి 6.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే సదరు నిందితుడు మాత్రం 12 కిలోల గంజాయితో బస్సులో బయల్దేరినట్లు తెలుస్తోంది. దారిలోనే రెండు ప్రాంతాల్లో ఆగాడని, ఆ రెండు చోట్ల కూడా గంజాయి విక్రయించాడా..? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారని సమాచారం.

## క్లుప్తంగా

### విద్యతో విజ్ఞానం.. క్రీడలతో ఆరోగ్యం


క్రీడాకారులకు జ్ఞాపికలు అందిస్తున్న మేయర్ అనిల్‌కుమార్

జ్యోతినగర్: విద్యతో విజ్ఞానం.. క్రీడలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కరీంనగర్ చాప్టర్ కార్యదర్శి తగరపు శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ విద్యతోపాటు క్రీడలో రాణించాలని అన్నారు. వెయిట్ లిఫ్టింగ్, కబడ్డీ, కరాటే, యోగా, అథ్లెటిక్స్‌తో పాటు వివిధ క్రీడల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను సన్మానించారు.

### గణేశ్ మండప నిర్మాణం అడ్డగింత


అధికారులతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ ప్రక్కన చెరువు శిఖం భూమిలో కాలనీవాసులు నిర్మిస్తున్న గణేశ్ మండప నిర్మాణ పనులను బుధవారం జెన్‌కో బీ–థర్మల్ విద్యుత్ కేంద్రానికి చెందిన సివిల్ విభాగం అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌కు తెలియజేయగా నిర్మాణ ప్రాంతానికి చేరుకొని సివిల్ విభాగం అధికారులతో మాట్లాడి కేవలం మండపాన్ని మాత్రమే నిర్మిస్తారని పేర్కొంటూ ఒప్పందపత్రం రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ విద్యుత్ కేంద్రానికి చెందిన వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమవుతున్నా వారిపై ఎలాంటి చర్యలు చేపట్టని అధికారులు కేవలం మండప నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు.





# ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్

- తోబుట్టువుల అనురాగాలకు సూచిక
- నేడు రాఖీ పౌర్ణమి


తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి

విద్యానగర్/కరీంనగర్ కల్చరల్: ఆధునికయుగంలో అనుబంధాలు ఇంకా తరిగిపోలేదు. ఉమ్మడి కుటుంబాలు తగ్గినా పేగుబంధాలు ధృడంగానే ఉన్నాయి. ఎక్కడ ఉన్నా పరస్పర యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆత్మీయత పంచుతూ తోబుట్టువుల బంధాన్ని శాశ్వతంగా నిలిపేది రక్షాబంధన్. సోదరీసోదరుల ఆత్మీయ బంధానికి ప్రతీక అయినా రక్షా బంధన్‌ను గురువారం దేశవ్యాప్తంగా జరుపుకోనున్నారు. పండుగ రోజున పుట్టిళ్లు సందడిగా మారుతాయి. అక్కాచెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల ముంజేతులన్నీ వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో కళకళలాడుతాయి. అండగా ఉంటామని హామీ ఇస్తూ అన్నదమ్ములు తమకు తోచిన కట్నకానుకలు సోదరీమణులకు ఇస్తారు. రక్షాబంధన్‌ను రాఖీపౌర్ణమి, జంధ్యాల పౌర్ణమిగా పిలుస్తారు.

**పండుగ ఎలా ప్రారంభమైందంటే..**

పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కర కాలం జరిగిన యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు పరివారమంతటినీ కూడగట్టుకొని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధం చేస్తున్నాడని తెలుసుకొని భర్త దేవేంద్రుడు సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్గిస్తుంది. సరిగా ఆ రోజు శ్రావణ పౌర్ణమి కావడంతో పార్వతీపరమేశ్వరులు, లక్ష్మీనారాయణను పూజించి రక్షాను దేవేంద్రుని చేతికి కడుతుంది. దేవతలందురూ పూజించిన రక్షాలను ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. అలా రాఖీ పండుగా మొదలైందని పురాణాలు చెబుతున్నాయి. అన్నాతమ్ముళ్లకు కట్టే రక్షాబంధన్ ద్వారా వారు తలపెట్టే కార్యాలు విజయవంతం కావాలని, సుఖసంతోషాలు, సిరి సంపదలు కలగాలని ఆకాంక్షించే విశిష్టత రాఖీ పండుగకు ఉంది. నూతన వస్త్రాలు, బహుమతులతో ఆనందంగా గడుపుతారు. "బ్రిటీష్‌వారు దేశాన్ని పాలిస్తున్న కాలంలో వారి ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. స్త్రీలు రక్షణ కోసం వీరయోధులకు రక్షాబంధన్ కట్టేవారు. సోదరభావంతో యోధులు మహిళలకు రక్షణ కల్పించేవారు. రాణి కర్ణావతి దుర్గాన్ని శత్రువులు ముట్టడించినప్పుడు ఢిల్లీ బాదుషాకు రాఖీ పంపింది. బాదుషా ఆమెను సోదరిగా భావించి శత్రువులను తరిమికొట్టి ఆమె ఇంట్లో భోజనం చేసి కానుకల సమర్పించినట్లు చరిత్ర.

**ఆన్‌లైన్ రక్షాబంధన్**

కాలం మారడంతో పాటు రక్షబంధన్ తీరు మారింది. విద్య, ఉపాధి, ఇతరత్రా కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదురులకు పోస్టు ద్వారా రాఖీలను పంపితే కట్టకొని తోబుట్టువులకు కానుకలు పంపుతుండే సంప్రదాయం నేటికి కొనసాగుతోంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతం కావడంతో ఆన్‌లైన్ ద్వారా రాఖీలను పంపి ఆన్‌లైన్ ద్వారానే కానుకలు స్వీకరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరస్పరం అభినందనలు తెలుపుకునే వెసులుబాటు ఉంది. పద్ధతులు మారినా రాఖీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కుచెదరలేదు.

**తమ్ముడంటే ప్రాణం**



మా ఇంట్లో మేము ముగ్గురం, మాకు తమ్ముడు అన్వేశ్ అంటే ప్రాణం, ప్రస్తుతం వాడు హుస్నాబాద్‌లోని శ్రీనివాస హాస్పిటల్ ఇన్‌చార్జి. రాఖీపండుగ రోజు ఎంత బిజీగా ఉన్నా వాడి దగ్గరికి వెళ్లి మేమిందరం కలిసి రాఖీ కడతాం. తమ్ముడు కూడా మా కోసం ప్రతీ పండుగకు ఎదురుచూస్తుంటాడు, వాడి ప్రేమాభిమానాలు ఎప్పటికీ కావాలి. వాడు ఆనందంగా ఉండాలని, ఉన్నతంగా ఎదగాలని కోరుకుంటాం.

– స్రవంతి, అమూల్య, కరీంనగర్

**ముగ్గురు అన్నదమ్ములు**



నాకు ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు అన్నలు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. తమ్ముడు మాత్రం కరీంనగర్‌లో మాతోనే ఉంటాడు, రైస్‌మిల్లు ఉంది. ప్రతి పండుగకు ఇద్దరు అన్నలు కళ్లముందు లేకున్న రాఖీ పంపిస్తాను. ఇక్కడ ఉండే కృష్ణకు మాత్రం స్వయంగా రాఖీ కడతాను.

– సింగిరికొండ మాధవి, తిరుమలనగర్, కరీంనగర్

**ఈ సమయాలు అనుకూలం**



గురువారమే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలి. శుభకార్యాలు, పండుగలకు సూర్యోదయ తిథి ప్రమాణంగా పాటించాలి. ఉదయం 6.30 నుంచి 9.45, మళ్లీ 10.50 నుంచి 11.50 నిమిషాల మధ్య, మధ్యాహ్నం 12.30 నుంచి 2.45 వరకు, సాయంత్రం 3.45 నుంచి 6.00 గంటల మధ్య రాఖీలు కడితే శుభకరం.

– శ్రీతాటిచెర్ల హరికిషన్‌శర్మ, పురోహితుడు

# వీడని మిస్టరీ

- అక్క మృతితో నాకు సంబంధం లేదు
- ఫ్రెండ్‌కు చెప్పి మద్యం నేనే తెప్పించా
- ఎవరో బాయ్‌ఫ్రెండ్‌కు అక్క ఫోన్ చేసింది
- తమ్ముడికి చందన వాయిస్ మెసేజ్
- డబ్బులు.. బంగారం మాయం
- దీప్తి ఒంటిపై గాయాలు..?
- పోలీసు బృందాల గాలింపు

'సాయి.. నేను, దీప్తి అక్క మద్యం తాగాలని అనుకున్నం.. కానీ నేను తాగలేదు.. అక్కనే తాగింది.. నేను నా ఫ్రెండ్‌తో తెప్పించా.. అది ఒప్పుకుంటా.. ఇంకా అక్కవాళ్ల బాయ్‌ఫ్రెండ్‌ను పిలుస్తా అంటే నేను వద్దన్నా.. అయినా పిలుస్తా అంది.. సరే లే నీ ఇష్టం అన్నా.. నేను ఇంట్లో నుంచి వెళ్లిపోదామనుకున్నా.. నిజమే.. అది నేను ఒప్పుకుంటా.. అక్కకు చెప్పి వెళదామనుకున్నా.. కానీ.. అప్పటికే అక్క హాఫ్ బాటిల్ వోడ్కా కంప్లీట్ చేసింది.. అంతకుముందే ఫోన్‌లో మాట్లాడింది. తర్వాత సోఫాలోకి వెళ్లి పడుకుంది.. నేను లేపితే లేవలేదు.. పడుకుంది కదా.. అని డిస్టర్బ్ చేయలేదు.. చాన్స్ దొరికింది కదా అని.. నేనే ఇంట్లో నుంచి వెళ్లిపోయా.. నా తప్పేం లేదు.. నాకు అక్కను చంపే ఉద్దేశమే లేదు.. ఇలా అవుతుందని అనుకోలేదు.. అక్కను నేనెందుకు చంపుతా.. నా దగ్గర డబ్బులు లేవు కాబట్టి ఇంట్లో నుంచి తీసుకెళ్లా'

– తన తమ్ముడు సాయి మొబైల్‌కి చందన పంపిన వాయిస్ మెసేజ్ ఇది..

కోరుట్ల: చందన తాను అక్కను చంపలేదని తమ్ముడు సాయికి వాయిస్ మెసేజ్ పంపడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మెసేజ్ ఆధారంగా విచారణ ముమ్మరం చేశారు. కోరుట్ల బస్టాండ్‌లో మంగళవారం ఉదయం కనిపించిన సీసీ ఫుటేజీ చిత్రాలు.. చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్‌వి కావనే సమాచారంతో విచారణ గందరగోళంగా మారింది. అయితే, చందన బాయ్ ఫ్రెండ్ కారులో వచ్చి ఉంటాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చందన ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు మరోసారి పరిశీలిస్తున్నారు. ఆమె వాయిస్ మెసేజ్ వచ్చిన సెల్‌ఫోన్ ఆధారంగా రెండు బృందాలు హైదరాబాద్‌కు చేరుకుని గాలింపు చేపట్టాయి.


కోరుట్ల బస్టాండ్ సీసీ ఫుటేజీలో యువకుడితో చందన

**దీప్తి ఒంటిపై గాయాలు..!?**

- అనుమానస్పదంగా మృతి చెందిన దీప్తి ఒంటిపై స్వల్పగాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో తేలినట్లు సమాచారం.
- దీప్తి టీషర్ట్ కింద శరీరం కాస్త కమిలిన గాయాలు, చెంపపై గీసుకుపోయినట్లుగా ఓ చిన్నగాయం ఉన్నట్లు తెలిసింది.
- దీంతోపాటు దీప్తి చేతులు కట్టేసినట్లుగా మణికట్టు వద్ద గాయం ఉన్నట్లు సమాచారం.
- ఒకవేళ చేయి విరిగి ఉంటే బంక దీప్తి హత్యకు గురైందన్న అంశానికి మరింత బలం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతాయి.
- సాధారణంగా పోస్టుమార్టం నివేదికకు సంబంధించిన షార్ట్ రిపోర్టు అదే రోజు అందించే ఆనవాయితీ ఉన్నా.. వైద్యులు ఈ విషయంలో కుదరదని చెప్పినట్లు తెలిసింది.

**డబ్బులు, నగలు మాయం**

బంక శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు, సుమారు 50 తులాల వరకు బంగారు ఆభరణాలు మాయమైనట్లు సమాచారం. ఇంట్లోనుంచి వెళ్లిపోయిన చందన.. డబ్బులు తాను తీసుకున్నట్లు వాయిస్ మేసేజ్‌లో చెప్పినా.. బంగారం విషయం ఎత్తలేదు. బంగారం సైతం చందన తీసుకెళ్లి ఉంటుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చందన తన క్లాస్‌మేట్ ఒకరితో కొన్నాళ్లుగా సన్నిహితంగా ఉంటోందని, అతడితో కలిసి డబ్బులు, నగలు తీసుకు వెళ్లి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

**దారి మళ్లిస్తున్నారా?**

చందన తమ్ముడికి పంపిన వాయిస్ మేసేజ్‌లో దీప్తి తన బాయ్‌ఫ్రెండ్‌కు పోన్ చేసి ఇంటికి రమ్మంటానని చెప్పిందని, తాను వద్దన్నానని చెప్పిన తీరు సంఘటనను దారి మళ్లించేందుకేనా? అనే అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. వాయిస్ మేసేజ్‌తో ఇంట్లో నుంచి చందన వెళ్లిపోయిన తర్వాత వేరెవరో వచ్చి ఉంటారన్న రీతిలో అనుమానాలు వచ్చేలా ఉండటం గమనార్హం. చందన, ఆమె బాయ్ ఫ్రెండ్ కలిసి దీప్తి చనిపోవడానికి తమకు సంబంధం లేదని నమ్మించడానికి ఈ రకంగా మేసెజ్ పెట్టారా? అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ దిశలో పోలీసు దీప్తి సెల్‌ఫోన్ డాటాను పరిశీలిస్తున్నారు.

# 'ప్యాసింజర్ రైళ్ల రద్దు సరైన నిర్ణయం కాదు'

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే తరచూ వివిధ కారణాలతో కాజీపేట–బల్లార్షా సెక్షన్ల మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం సరైన నిర్ణయం కాదని రైల్వే ప్రజాసంబంధాల సభ్యుడు క్యాతం వెంకటరమణ అన్నారు. బుధవారం రామగుండంలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే విడతల వారీగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన రైల్వే శాఖ మళ్లీ సెప్టెంబర్ 9వ తేదీ వరకు రద్దును పొడగిస్తున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతం మీదుగా సిర్పూర్‌కాగజ్‌నగర్–భద్రాచలం రోడ్ వెళ్లే సింగరేణి ప్యాసింజర్ రైలు దశల వారీగా ఆరు నెలలుగా రద్దు కావడంతో సింగరేణి కార్మిక కుటుంబాలు రైల్వేశాఖ నిర్ణయంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారని తెలిపారు. దీనిపై దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసి గంట ఆలస్యమైనా ప్యాసింజర్ రైళ్ల రాకపోకలను పునరుద్ధరించి సాధారణ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరనున్నామని అన్నారు.

### ఆర్జీ–3లో సివిల్ జీఎం పర్యటన

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లో బుధవారం సివిల్ జీఎం సూర్యనారాయణ పర్యటించారు. సివిల్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్వోటూ జీఎం బైద్య, సివిల్ డీజీఎం పద్మరాజు, డీవైపీఎం రవీందర్, ఎస్ఎస్వో లక్ష్మీనారాయణ, సీనియర్ ఎస్టేట్ అధికారి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.





## బొగ్గుబాయి వార్తలు

# పోరాడి హక్కులు సాధించుకోవాలి


మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: యాజమాన్యంతో పోరాడి హక్కులు సాధించుకోవాలే తప్ప బ్రతిమిలాడి కాదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. బుధవారం ఆర్జీ–1 ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం, కార్మిక వాడల్లో కనీస సౌకర్యాలు, సీఎంపీఎఫ్ వడ్డీ సవరణకై చేసిన పోరాటాలకు ఆకర్షితులై పలువురు తమ యూనియన్‌లో చేరుతున్నారని అన్నారు. సింగరేణిలో కార్మికులు పలు అంశాలపై అవగాహనను కలిగి యాజమాన్యాన్ని ప్రశ్నించే విధంగా తయారు కావాలని సూచించారు. కోలిండియాలో ఆగస్టు నెల వేతనాలతో ఏరియర్స్ ఇస్తున్నారని ప్రకటించారన్నారు. బకాయిలు రాక ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతూ ఏరియర్స్ ఎప్పుడు ఇస్తారో చెప్పలేని పరిస్థితిలో సింగరేణి ఉందన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు మెండె శ్రీనివాస్, ఆరెపల్లి రాజమౌళి, నంది నారాయణ, పీఆర్‌చారి, సంతోష్‌కుమార్, అరణ్య, బి.ఓదెలు, వంగల శివరాంరెడ్డి, కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, సంద్ర రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

# కార్మికుల ప్రాణాలతో చెలగాటం


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: కాంట్రాక్టర్ల కమీషన్లకు కక్కుర్తిపడి కార్మికుల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. బుధవారం జీడీకే–11గనిలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేవలం పైరవీలు, మెడికల్ అన్‌ఫిట్ దందాలకే పరిమితమయ్యారని తెలిపారు. 2015లో ఎంఎండీఆర్ బిల్లుకు అనుకూలంగా మద్దతు పలికిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు ఇప్పుడు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నట్టు నటిస్తున్నారన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయి ప్రతీపని ఎమ్మెల్యే, ఎంపీల సిఫారసుతోనే చేస్తున్నారని విమర్శించారు. శ్రీరాంపూర్ సభ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు మారుపేర్ల మార్పు, 10 నూతన బొగ్గు గనుల ప్రారంభం, 10వేల నూతన క్వార్టర్ల నిర్మాణం హామీగా మిగిలిపోయాయన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, వంగ లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్ పాల్గొన్నారు.

# పాతకక్షలతోనే సతీశ్ హత్య

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- 7 మొబైల్ ఫోన్లు, ఒక కారు, రెండు బైక్‌లు స్వాధీనం
- డీఎస్పీ రవీందర్‌రెడ్డి వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్: సంచలనం సృష్టించిన కన్నం సతీశ్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఇందిరానగర్‌కు చెందిన కన్నం సతీశ్ ఈనెల 20న రాత్రి 10.58 గంటల సమయంలో తన స్నేహితుడు నిఖిల్‌తో కలిసి పట్టణ శివారులోని శక్తి బార్ వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న శివాజీనగర్‌కు చెందిన జక్కం రాజేశ్.. సతీశ్‌తో మాటలు కలిపాడు. బార్ సమీపంలోని సందిలోకి తీసుకెళ్లాడు. కొద్దిదూరం వెళ్లాక సతీశ్ తలపై రాజేశ్‌తోపాటు పాతర్ల నవీన్ కర్రలతో దాడి చేశారు. అక్కడే ఉన్న నేరవేణి రమేశ్ ఇటుకతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సతీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. 2015లో రాజేశ్, సతీశ్ మధ్య ఓ విషయంలో వివాదం తలెత్తింది. ఈక్రమంలో సతీశ్.. రాజేశ్‌పై దాడిచేశాడు. కొద్దిరోజుల తర్వాత ఇద్దరి మధ్య రాజీకుదిరింది. ఆ తర్వాత వీరి మధ్య పలుమార్లు ఘర్షణలు జరిగాయి. వీటిని దృష్టిలో ఉంచుకొనే సతీశ్‌ను హతమార్చారు. దాడిలో పాల్గొన్న ముగ్గురు పారిపోయేందుకు, డబ్బులు సమకూర్చే తదితర విషయాల్లో మెట్‌పల్లికి చెందిన తాటికొండ రామకృష్ణ, గుండు గోపాల్, మిట్టపల్లి రాంమోహన్, కోరుట్లకు చెందిన చింతకింది హరీశ్ సహకరించారు. హత్యలో ముగ్గురు పాలుపంచుకోగా, వారికి సహకరించిన నలుగురిని మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీరిపై 302, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురి రికార్డు పరిశీలించాక నేరచరిత్ర ఉంటే పీడీ యాక్ట్ నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తామని డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఎస్ఐలు ఉమాసాగర్, నవీన్ పాల్గొన్నారు.

### ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య


రాయమల్లు(ఫైల్)

ఎలిగేడు: , మండలంలోని ధూళికట్టకు చెందిన మారం రాయమల్లు (75) మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జూలపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయమల్లు భార్య 10నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఒక్కడే నివాసం ఉంటున్నాడు. నెలరోజుల క్రితం పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతునానడు. వ్యాధి ముదరడంతో బంధువులు ఆస్పత్రిలో చూపించినా వైద్యులు ఏమి లేదని చెప్పారని, ఇక ఈ వ్యాధి నయం కాదేమోనని జీవితంపై విరక్తితో ఏదో ఒకటి చేసుకుని చనిపోతానని బంధువులతో చెప్పుతుండేవారు. మంగళవారం రాత్రి 7గంటల సమయంలో ఇంట్లో ఊరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువు పాలవేని స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

### జీడీకే–1వ గనిలో ప్రమాదం


గాయపడిన వెంకటేష్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–1వ, గనిలో ప్రమాదం జరిగి బట్టి వెంకటేష్ అనే ట్రామర్ కార్మికుడు గాయపడ్డాడు. గనిలోని 10వ డీప్, 34వ లెవల్, 4వ సీమ్‌లో టబ్బులు మీదపడటంతో కుడి కాలు విరిగింది. గాయాల పాలైన వెంకటేష్‌ను హుటాహుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి రెఫరల్ చేశారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య గనిలోకి దిగి సంఘటన ప్రాంతాన్ని సందర్శించి ఘటనకు సంబంధించిన పూర్తివివరాలు తెలుసుకున్నారు.

### నైతిక విలువలు కాపాడుకోవాలి


శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్: డిజిటల్ యుగంలో మన సంప్రదాయాలను మరిచిపోయి ఆధ్యాత్మికత మరిచిపోతున్నారని, నైతిక విలువలు కాపాడుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన ముందస్తు రక్షాబంధన్, శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు విద్యార్థి దశ నుంచే ప్రతీ పండుగను నిర్వహించి ప్రాధాన్యతను తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు నరేందర్‌రెడ్డికి రాఖీలు కట్టారు. చిన్నారులు విచిత్ర వేషధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

### సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తా సమీపంలోని టీ2–1147 క్వార్టర్‌లో నివాసముంటున్న సింగరేణి కార్మికుడు షేక్ జిలానీ ఇంట్లో చోరీ జరిగి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ జిలాని ఈనెల 27న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఇల్లందుకు వెళ్లారు. 30న తిరిగి వచ్చి చూసే సరికి తాళం తీసి ఉండటం చూసి వెంటనే ఇంట్లోకి వెళ్లి బీరువాను పరిశీలించగా లాకర్‌లోని 4 తులాల వెండి బ్రాస్‌లైట్, రెండు బంగారం ఉంగరాలతో పాటు రూ.52 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.